తొలి క్రాంతి NEWS

https://www.tholikranthidaily.in TEL TEL - 12281

# తొలిక్రాంతి

మన గొంతుక.. మన పత్రిక

తెలుగు దినపత్రిక..

హైదరాబాద్

శనివారం

7-6-2025

వెల రూ. 4/-

పేజీలు : 04

Published From : Hydarabad Editor : Malothu Chandrakala



## చినాబ్‌ను ప్రారంభించిన ప్రధాని

2

శ్రీనగర్ జూన్6(తొలి క్రాంతి): చినాబ్ వంతెనపై జాతీయ పతాకంతో ప్రధాని మోదీ గర్జించారు. జమ్మూ కశ్మీర్ లో ప్రధానమంత్రి రూ. 46 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గురువారం జమ్మూకశ్మీర్ పర్యటన సందర్భంగా చినాబ్ నదిపై నిర్మించిన వంతెనను ప్రారంభించారు. వంతెనపై భారత జాతీయ పతాకాన్ని చేతబూని దేశ ఐక్యతను చాటారు.

రూ. 46 వేల కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

కాత్రా – శ్రీనగర్ వందే భారత్ రైలు ప్రారంభం

తొలి కేబుల్ రైలు వంతెన అంజి ప్రారంభం



## అది దెయ్యాల రాష్ట్రసమితి

2



కల్వకుంట్ల కవిత అడిగిన ప్రశ్నకు కేసీఆర్ సమాధానం ఇవ్వాలి

కొరివి దెయ్యాలను తెలంగాణ పొలిమేర దాటే వరకు తరిమికొట్టాలి

కేసీఆర్ ఏమైనా దేవుడా? ఆయన కూడా మనిషే కదా

ఒక్క నోటీసు ఇస్తేనే ఆగమాగం అవుతున్నాడు

సీఎం రేవంత్‌రెడ్డి

ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



## అన్యాయం జరుగుతుంటే స్పందించరేం?

ఉత్తమ్ అబద్దాలు చూస్తే గోబెల్స్ అనేవాడు ఉంటే ఉరి పెట్టుకునేవాడు

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్టే తెచ్చి ఆపిందే బిఆర్ఎస్

400 టీఎంసీల గోదావరి జలాలను అక్రమంగా ఏపీ తరలిస్తుంటే గుడ్లు అప్పగించుకొని చూస్తారా?

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

2



## నాపై తుపాకీ పెట్టినా నిజమే చెప్తా

తప్పుఒప్పులు ఎవరివో తెలంగాణ ప్రజలు తెలుస్తారు

ఆ సమాచారం అంతా వాళ్లిద్దరి వద్దే

ప్రాజెక్టు వ్యయం రూ.63 వేల కోట్ల నుంచి రూ.82 వేల కోట్లకు పెరిగింది

కాళేశ్వరం అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు

కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



2

## సింగరేణి విదేశాల్లో బ్లాకులు కొనాలి



2



దేశ ఖనిజ రంగాన్ని మరింత బలోపేతం చేయాలి

విదేశీ ఖనిజ బ్లాకులలో పెట్టుబడులు పెట్టాలి

కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

## ప్రజల ఆకాంక్షలే మా లక్ష్యం

జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులపై గత పాలకులు నిర్లక్ష్యం

పాలమూరురంగారెడ్డి ను 90 శాతం పూర్తి చేసినట్లు ప్రచారం చేసుకున్నారని అది పూర్తిగా అబద్ధం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మహబూబ్‌నగర్ జూన్6(తొలి క్రాంతి):<తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే తమ ప్రభుత్వానికి మొదటి లక్ష్యం అని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి పేర్కొన్నారు. భట్టి విక్రమార్క మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడారు.



2



## బనకచర్ల ప్రాజెక్టును అంగీకరించాం

బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు తీవ్ర అన్యాయం

ఈ ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్ర మంత్రులకు లేఖలు రాశా

కృష్ణా జలాల విషయంలో గత ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసింది

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



## కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

కాంగ్రెస్ ప్రభుత్వంపై రూ.25 వేల కోట్ల అవినీతి ఆరోపణల వ్యవహారం

నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని కేటీఆర్‌కు ధర్మాసనం ఆదేశం

2

తొలిక్రాంతి
శనివారం 7 జూన్ 2025



# నాపై తుపాకీ పెట్టినా నిజమే చెప్తా

## బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ జూన్6(తొలి క్రాంతి):కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను శుక్రవారం కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్ విచారించింది. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి సమాచారం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు వద్దే ఉండేదని ఆర్థిక శాఖకు ఇందులో పెద్దగా పాత్ర లేదని స్పష్టం చేశారు."కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో నా పాత్ర ఏమీ లేదు" అని ఈటల రాజేందర్ తేల్చిచెప్పారు. ప్రాజెక్టు రీడిజైనింగ్ కోసం కేసీఆర్ కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని, దానికి అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ఛైర్మన్‌గా వ్యవహరించారని గుర్తుచేశారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకునే మేడిగడ్డ వద్ద ఆనకట్ట నిర్మాణం చేపట్టారని, అయితే ఆనకట్టల నిర్మాణం అనేది పూర్తిగా సాంకేతిక నిపుణులకు సంబంధించిన అంశమని, దానిపై రాజకీయ నాయకులకు అవగాహన ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రాజెక్టు వ్యయం గురించి ప్రస్తావిస్తూ "మొదట కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.63 వేల కోట్లతో ప్రతిపాదన చేశారు. తర్వాత అనేక కారణాలతో ప్రాజెక్టు వ్యయం రూ.82 వేల కోట్లకు పెరిగింది" అని ఈటల వివరించారు. కమిషన్ తనను ఆర్థికపరమైన అంశాలపై ప్రశ్నలు అడిగిందని, కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలపై ఆర్థిక శాఖ ప్రమేయం ఉందా అని ప్రశ్నించిందని తెలిపారు. దీనికి ఆర్థిక శాఖకు ఏమాత్రం సంబంధం లేదని, ఇది పూర్తిగా ఇరిగేషన్ శాఖకు సంబంధించిన విషయమని తాను కమిషన్‌కు స్పష్టం చేసినట్లు చెప్పారు."నా కణతపై తుపాకీ పెట్టినా సరే.. నిజమే మాట్లాడతా. తప్పుఒప్పులు ఎవరివో తెలంగాణ ప్రజలు తేలుస్తారు" అని ఈటల అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై అన్ని రిపోర్టులు బయటపెట్టాలని, ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని హితవు పలికారు. ప్రాజెక్టు నష్టాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. "ఈ ప్రాజెక్టు తన మానస పుత్రిక అని కేసీఆర్ వందల సార్లు చెప్పారు. ఏ పార్టీలో ఉన్నా, ఏ పదవిలో ఉన్నా నైతిక విలువలు పాటించా" అని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# అన్యాయం జరుగుతుంటే స్పందించరేం?

## మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట జూన్6(తొలి క్రాంతి): సీఎం రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు బీజేపీ ఎంపీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అనుకున్నం కానీ ఆయన్ని మించి తాత అయ్యిండు ఉత్తమ్ కుమార్ రెడ్డి అని విమర్శించారు. ఉత్తమ్ అబద్దాలు చూస్తే గోబెల్స్ అనేవాడు ఉంటే ఉరి పెట్టుకునేవాడు అని హరీశ్‌రావు అన్నారు. దుబ్బాకలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్టే తెచ్చి ఆపిందే బిఆర్ఎస్, కేసీఆర్ అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి విజయవాడకు పోయి చంద్రబాబును కలిసి బజ్జీలు తిని వచ్చిండు. అప్పటి నుంచి ఏం మాట్లాడటం లేదు. కృష్ణా నది జలాల్లో రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు వాడనంత తక్కువ నీళ్లు వాడింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆంధ్రాకు దాసోహం చేసి ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్‌లో పంటలను ఎండబెట్టింది కాంగ్రెస్. తాత్కాలిక కేటాయింపుల ప్రకారం, 65 టీఎంసీలు తక్కువ వాడిన చేతగాని దద్దమ్మ ప్రభుత్వం. ఆరున్నర లక్ష ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడమే పంట ఎండబెట్టడమే. దీనికి సమాధానం చెప్పు చెంపేలేసుకొని ముక్కు భూమికి రాయి ఉత్తమ్ కుమార్ రెడ్డి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

గోదావరి బనకచర్ల మీద ప్రిపేర్ కాలేదు అంటున్నడు ఉత్తమ్. నీటి పారుదల శాఖ మంత్రిగా నువ్వు ఎంతో బాధ్యత రాహిత్యంగా ఉన్నావు. స్టడీ చేయలేదని మాట్లాడటం నిర్లక్ష్యం. కేబినెట్‌లో బనకచర్ల గురించి మాట్లాడేందుకు సమయం లేదా? ఇంతకంటే ముఖ్యమైన అంశం ఇంకోటి ఉంటదా? ఐదు గంటలు కమిషన్లు, పర్సెంటీజీలు, హైకమాండ్‌కు పంపే మూటల గురించి మాట్లాడారా? 400 టీఎంసీల గోదావరి జలాలను అక్రమంగా ఏపీ తరలిస్తుంటే గుడ్లు అప్పగించుకొని చూస్తారా? సుప్రీం కోర్టుకు వెళ్లరా, కేంద్ర మంత్రిని కలవరా, నీతి అయోగ్‌లో సీఎం ఎందుకు మాట్లాడలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.అపెక్స్ కమిటి అనుమతి లేకుండా అంతర్ రాష్ట్ర అనుమతి లేకుండా గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే ఎందుకు మౌనం. చంద్రబాబును ఎదురించే దమ్ము సత్తా లేదా ఎందుకు లాగులు తడుస్తున్నాయి. ఎందుకు సుప్రీం కోర్టుకు వెళ్లరు, ఎందుకు ప్రధానిని ప్రశ్నించరు. బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. పూర్తిగా ఏపీకి దాసోహం అయిపోయారు. రాష్ట్రం స్పందించకుంటే సుప్రీం కోర్టుకు బిఆర్ఎస్ వెళ్తుందని చెప్పినం. ఇప్పటికీ ఆ మాటకు కట్టుబడి ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.లేఖలు రాసి చేతులు దులుపుకుంటన్నారు.

అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకువెళ్లాలి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేద్దాం పదండి. కృష్ణా నదిలో న్యాయమైన వాటా కిందకి వదిలింది మీరు, గోదావరి బనకచర్ల కడుతుంటే చేతులు కట్టుకొని చూస్తున్నది మీరు, శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ జరుగుతుంటే ఆపకుండా చూస్తున్నది మీరు, బిఆర్ఎస్ లైనింగ్ పనులు ఆపిస్తే ఇప్పుడు మీరు వచ్చాక మొదలు పెట్టారు. తక్షణం ఆ పనులను నిలిపి వేయించాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే బిజేపీ పెదవి విప్పడం లేదు. గోదావరి బనకచర్ల మీద బిజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు బిజేపికి పట్టవా? బనకచర్ల ద్వారా తెలంగాణ గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి? శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పూర్తి అయితే రోజుకు 90వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. బిజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కండ్లు తెరవండి. ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నది. శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ అక్రమ పనులు ఆపడం లేదు? గోదావరి బనకచర్ల అక్రమ ప్రాజెక్టును ఆపడం లేదు? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.గంధమల్ల ప్రాజెక్టు అంటే కాళేశ్వరంలో అంతర్భాగం. కాళేశ్వరం కూలితే గంధమల్లకు నీళ్లు ఎలా వస్తాయి రేవంత్ రెడ్డి. గంధమల్లకు ఎట్ల కొబ్బరి కాయ కొడుతున్నవు. గంధమల్ల, మల్లన్నసాగర్, రంగనాయర్ సాగర్, మిడ్ మానేర్, ఎల్లంపల్లి.. ఇదంతా కాళేశ్వరం కాదా రేవంత్ రెడ్డి. కుప్పకూలింది అని ప్రచారం చేసావు. కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదావరి జిలాలు ఎట్ల వస్తాయి. నువ్వు ఇన్ని రోజులు చేసిన ప్రచారం శుద్ధ తప్పు అని తేటతెల్లమైంది. నువ్వు చేసింది అదంతా గోబెల్స్ ప్రచారంమూసీలో గోదావరి నీళ్లు పోస్తా అంటవు, ఎట్ల సాధ్యమైతది రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.



# సింగరేణి విదేశాల్లో బ్లాకులు కొనాలి

## కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి


న్యూ ఢిల్లీ జూన్6(తొలి క్రాంతి):కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఢిల్లీలో నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ ఔట్‌రీచ్ ఫోరమ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సెమినార్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. క్లీన్ ఎనర్జీ, సెమీకండక్టర్స్, రక్షణ, డిజిటల్ టెక్నాలజీ రంగాలకు క్రిటికల్ మినరల్స్ (లిథియం, కోబాల్ట్, నికెల్ వంటివి) ఎంతో ముఖ్యమని వీటి సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి ఈ ఫోరమ్ ఒక వేదికగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ ఫోరమ్ ప్రభుత్వం పరిశ్రమలు విద్యా సంస్థలు పరిశోధన సంస్థల మధ్య సమన్వయ సహకారాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు.మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో గనుల రంగంలో అనేక సంస్కరణలు తెచ్చిందని పారదర్శకంగా మినరల్ బ్లాకుల వేలం ప్రక్రియను అమలు చేస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 34 క్రిటికల్ మినరల్ బ్లాకుల వేలం పూర్తయిందని ఇందులో లిథియం, గ్రాఫైట్ వంటి ముఖ్యమైన ఖనిజాల బ్లాకులు ఉన్నాయని వెల్లడించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గత మూడేళ్లలో 445 ప్రాజెక్టులను చేపట్టిందని 185 ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్టులు ఖనిజ సంపదను గుర్తించడం అన్వేషణను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. భారత్ ఆస్ట్రేలియా, అర్జెంటీనా, చిలీలతో క్రిటికల్ మినరల్స్ సరఫరా, అన్వేషణ, ప్రాసెసింగ్‌కు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకుందని వెల్లడించారు. ఈ ఒప్పందాలు భారతదేశ ఇంధన భద్రత, సాంకేతిక అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, మన దేశంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ విదేశాల్లో క్రిటికల్ మినరల్ బ్లాకులను సొంతం చేసుకోవాలని, దీని ద్వారా దేశ ఖనిజ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సింగరేణి సంస్థ ఇప్పటికే బొగ్గు ఉత్పత్తిలో దేశంలో అగ్రగామిగా ఉందని, ఇప్పుడు విదేశీ ఖనిజ బ్లాకులలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మరింత వృద్ధి సాధించాలని పేర్కొన్నారు.

# బనకచర్ల ప్రాజెక్టును అంగీకరించాం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ జూన్6(తొలి క్రాంతి):బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అంతర్రాష్ట్ర జలవివాదాల పరిష్కార నిబంధనలకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాలకు, అపెక్స్ కౌన్సిల్ ఆదేశాలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని ఆయన తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈ అంశంపై తమ అభ్యంతరాలను వివరిస్తూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు ఇప్పటికే లేఖలు రాశామని మంత్రి తెలిపారు.కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిపిన సంప్రదింపుల గురించి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరిస్తూ, "ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనలు తమ వద్దకు రాలేదని ఒకవేళ వస్తే అన్ని నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని పాటిల్ చెప్పారు. చట్ట ప్రకారమే ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు" అని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ఉల్లంఘనలను తాము రాసిన లేఖల్లో సమగ్రంగా వివరించామని తెలిపారు. చట్టవిరుద్ధమైన పనులకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని తాము భావించడం లేదని, ఒకవేళ తెలంగాణకు అన్యాయం జరిగితే మాత్రం ఎంతవరకైనా పోరాడతామని హెచ్చరించారు. "తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేస్తాం. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని మంత్రి ఉద్ఘాటించారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఈ విషయంలో చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ఆయన కోరారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా 724 టీఎంసీలు కాగా, బీఆర్ఎస్ హయాంలో 1,254 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతుంటే గత ప్రభుత్వం సహకరించింది" అని ఆయన విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం చేసిన వృథా ఖర్చును ఇతర కృష్ణా బేసిన్ ప్రాజెక్టులపై పెట్టి ఉంటే అవన్నీ పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు."తుమ్మిడిహట్టి వద్ద కాకుండా మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడం వల్ల రూ.68 వేల కోట్ల అదనపు భారం పడింది. ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా?" అని ఆయన ప్రశ్నించారు.

# చినాబ్ ను ప్రారంభించిన ప్రధాని



శ్రీనగర్ జూన్6(తొలి క్రాంతి): చినాబ్ వంతెనపై జాతీయ పతాకంతో ప్రధాని మోదీ గర్జించారు. జమ్మూకశ్మీర్ లో ప్రధానమంత్రి రూ. 46 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గురువారం జమ్మూకశ్మీర్ పర్యటన సందర్భంగా చినాబ్ నదిపై నిర్మించిన వంతెనను ప్రారంభించారు. వంతెనపై భారత జాతీయ పతాకాన్ని చేతబూని దేశ ఐక్యతను చాటారు. ఆయన ఒక్కరే వంతెనపై తిరుగుతూ జాతీయ పతకాన్ని గాలిలో తిప్పారు. వంతెన నిర్మాణంతో చైనా, పాక్ లకు చెక్ పెట్టగలిగారు. వారిలో మరింత ఆందోళన మొదలైంది. అనంతరం దేశంలో తొలి కేబుల్ రైలు వంతెన అంజిని ప్రారంభించారు. కాత్రా నుంచి శ్రీనగర్ వరకు వందేభారత్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. ఉదంపూర్–బారాముల్లా రైలు లింక్ ప్రాజెక్టులో ముఖ్యమైన భాగం, కాశ్మీర్ లోయను భారత్ మిగిలిన ప్రాంతాలతో కలుపుతుంది. దీంతో ప్రయాణ సమయం మూడు గంటలు తగ్గుతుంది. ఆయా కార్యక్రమంలో ప్రధానితోపాటు జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తదితరులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి చీనాబ్ ఆర్చ్ వంతెన నుంచి ఇంజిన్‌లో కూర్చొని కేబుల్–స్టేడ్ అంజి వంతెన వద్దకు చేరుకోవడం విశేషం. చినాబ్..చినాబ్ కింద నది నుంచి 359 మీటర్ల ఎత్తులో నిర్మించారు. పొడవు 1,315 మీటర్లు. ఇప్పటివరకు చైనాలోని బెయిపాన్ నదిపై ఉన్న షుబాయ్ రైల్వే వంతెన (275 మీటర్లు ఎత్తు) పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును చినాబ్ అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువ. అతివేగం, భూకంపాలు, వరదలు, బాంబు పేలుళ్లను సైతం తట్టుకునేలా అత్యాధునిక సాంకేతికతతో దీనిని నిర్మించారు. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. ఈ వంతెన జీవితకాలం దాదాపు 120 ఏళ్లు. వంతెనపై గరిష్ఠంగా 100కి.మీ. వేగంతో రైలు వెళుతుంది. 1.31 కి.మీ. మేర విస్తరించిన దీని నిర్మాణానికి కేంద్రం సుమారు రూ.1,486 కోట్లు ఖర్చు చేసింది. అలాగే 29వేల టన్నుల ఉక్కును వినియోగించారు. (ఈఫిల్ టవర్ కన్నా మూడు రెట్లు ఎక్కువ ఐరన్ ను వినియోగించారు). 17 పిల్లర్లతో కూడిన నిర్మాణం. 46వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ ను వినియోగించారు. 266 కి.మీ. వేగంతో వచ్చే గాలులు కూడా తట్టుకోగలదు. 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయ్ హయాంలో ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. 23 ఏళ్ల తరువాత పూర్తయ్యింది.

# ప్రజల ఆకాంక్షలే మా లక్ష్యం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మహబూబ్‌నగర్ జూన్6(తొలి క్రాంతి):తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే తమ ప్రభుత్వానికి మొదటి లక్ష్యం అని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి పేర్కొన్నారు. భట్టి విక్రమార్క మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ.. "ప్రజల ఆశలు, ఆకాంక్షలే మా లక్ష్యం" అని స్పష్టం చేస్తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులపై గత పాలకులు నిర్లక్ష్యం చూపినట్లు ఆరోపించారు. గత పదేళ్లలో ఈ ప్రాంతానికి నీళ్లు అందించలేదని, నిధులు దుర్వినియోగమయ్యాయని విమర్శించారు.నిధులు సరిగా వినియోగించకపోవడం వల్ల ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు మహబూబ్‌నగర్ జిల్లాకు పునాదిగా నిలిచాయని, బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ను 90 శాతం పూర్తి చేసినట్లు ప్రచారం చేసుకున్నారని, అది పూర్తిగా అబద్ధమని ప్రాజెక్టును అసంపూర్తిగా మధ్యలోనే వదిలేశారని ఆయన విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని. దీని ద్వారా బీడు భూములను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ ప్రాజెక్టు ద్వారా మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక్క సంవత్సరంలోనే రైతు రుణమాఫీ, ఉచిత బస్సు పథకం, ఆరోగ్య శ్రీ, ఉద్యోగ నియామకాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్లు చెప్పారు.




# అది దెయ్యాల రాష్ట్రసమితి

విపక్ష బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు.

ఆలేరు జూన్6(తొలి క్రాంతి): యాదాద్రి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం తిరుమలాపూర్ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు తెలియచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మీద రేవంత్ విమర్శలు, సెటైర్లు సంధించారు. సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన అంశాల విషయానికొస్తే.. 'తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం.

యాదాద్రి పేరుని యాదగిరిగుట్టగా మార్చాం. తిరుమల మాదిరిగా యాదగిరిగుట్ట అభివృద్ధి. టీటీడీ మాదిరిగా వైటీడీ ఏర్పాటు చేశాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపుర నిర్మాణం. కొండపై భక్తులు నిద్రించేలా, ఆటోలు నడిచేలా చేశాం. త్వరలో యాదగిరిగుట్ట ఆలయ కమిటీ ఏర్పాటు. స్థానిక విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి తీసుకెళ్తాం.' అని సీఎం చెప్పారు. గంధమల్ల ప్రాజెక్టును గతంలో ఎందుకు పూర్తిచేయలేదని ఈ సందర్భంగా సీఎం రేవంత్, గత బీఆర్ఎస్ సర్కారుని నిలదీశారు.ఇంకా సభలో సీఎం ఏం మాట్లాడారంటే.. 'నల్లగొండ రైతుల కష్టాలు తీర్చుతాం. కమీషన్ల కోసమే గత ప్రభుత్వం కాళేశ్వరం కట్టింది. మూసీ ప్రక్షాళన చేసి చూపిస్తాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. పేదల ఇళ్లు కూలగొడుతున్నామంటూ విష ప్రచారం చేశారు. మూసీ నది ప్రక్షాళనను అడ్డుకుంటున్నారు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం. సబర్మతి, గంగ నదులు ప్రక్షాళన చేస్తున్నప్పుడు.. మూసీ ప్రక్షాళన ఎందుకు చేయకూడదు?. మూసీ ప్రాంతంలో ప్రజల కష్టాలు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా?. నల్గొండ జిల్లా రైతులు బాగుపడకూడదనే బిఆర్ఎస్ కుట్ర. ఎస్ ఎల్ బి సి ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు'. అని సీఎం రేవంత్ అన్నారు.అటు ప్రతిపక్షపార్టీ బిఆర్ఎస్ పైన సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. అది బీఆర్ఎస్ కాదు.. అది (దెయ్యాల రాజ్య సమితి)పార్టీ అంటూ రేవంత్ విమర్శలు చేశారు. బీఆర్ఎస్ లో దెయ్యాలు ఉన్నాయని కవితే అన్నారు. ఇంటి ఆడబిడ్డే దెయ్యాలు ఉన్నాయి అంటే నోరు విప్పని పరిస్థితి..కొరివి దెయ్యాలను తెలంగాణ పొలిమేర దాటేవరకు తరిమికొట్టాలి.. పదేళ్లపాటు తెలంగాణను దోచుకుతిన్నారు. బంగారు తెలంగాణ ముసుగులో బొందలగడ్డ చేశారు. తెలంగాణను బొందలగడ్డ చేసిన ప్రతి వెధవ మాట్లాడుతున్నాడు. తెలంగాణను రూ.8 లక్షల కోట్ల అప్పుల ఊబిలో పడేశారు. పదేళ్లు దోచుకు తిన్న మీరా.. నన్ను ప్రశ్నించేది?. యాదగిరిగుట్టలో అపచారం వల్లే గత ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంది. గతంలో చేసిన పాపాల వల్లే కిందపడి మక్కెలు ఇరగ్గొట్టుకున్నారు. వాసాలమర్రిని ఆదర్శ గ్రామం చేస్తామని చెప్పి ఇళ్లు కూల్చేశారు. ఎర్రవల్లికి రోడ్డు వేసుకునేందుకే వాసాలమర్రిని కూల్చేశారు' అని రేవంత్





# కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

హైదరాబాద్ జూన్6(తొలి క్రాంతి):తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25 వేల కోట్ల అవినీతికి పాల్పడిందంటూ గతంలో తీవ్ర ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయనపై నమోదైన కేసులో ఈ పరిణామం చోటుచేసుకుంది.కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదైంది. అయితే, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువడింది.హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆత్రం సుగుణ సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్‌పై ప్రతివాదిగా ఉన్న కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని కేటీఆర్‌ను ఆదేశిస్తూ, తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది



## వాహ వేడుకలో పాల్గొన్న మెచ్చా నాగేశ్వరరావు

**వేదాంతపురంలో సందడి**

**అనంతరం కోళ్ల ఫార్మ్‌ను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే**

అశ్వరావుపేట, జూన్ 06 తొలి క్రాంతి:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వేదాంతపురం గ్రామం ఆనందవాతావరణంలో ముంచెత్తింది. ఈ గ్రామానికి చెందిన దీవి రామకృష్ణ కుమార్తె వివాహ వేడుకలో అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, తమ శుభాకాంక్షలు తెలిపారు.వివాహ కార్యక్రమం అనంతరం, స్థానికుడైన శివశంకర్ ప్రసాద్ స్థాపించిన నూతన కోళ్ల ఫార్మ్‌ను సందర్శించిన ఆయన, ఫార్మ్‌లో చేపట్టిన శుభారంభ కార్యకలాపాలను పరిశీలించారు. వ్యవసాయ ప్రాతిపదికన గ్రామీణ యువత తమ స్వంత ఉపాధి మార్గాలు అభివృద్ధి చేసుకుంటుండడం అభినందనీయమని ఆయన వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి యుఎస్ ప్రకాష్ రావు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్ మూర్తి, మోహన్ రెడ్డి, వీర్రాజు, బుల్లయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.గ్రామీణ అభివృద్ధికి తోడ్పడే ప్రయత్నాలపై చర్చలు కూడా జరిగాయి.






## ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే మరమ్మతులు

**ఏఐఎస్ఎఫ్ డిమాండ్విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు మౌలిక సదుపాయాలు కల్పించాలి: ఏఐఎస్ఎఫ్**

అశ్వాపురం, జూన్ 06 తొలి క్రాంతి:2025-26 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంతటా ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తులు చేపట్టి, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి డిమాండ్ చేశారు.అశ్వాపురం మండలంలో ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో మూత్రశాలలు, తాగునీటి సమస్యలు, విరిగిన బెంచీలు, శిథిలావస్థకు చేరిన గదులు, మద్యం సీసాలతో వ్యాప్తి చెందిన అసాంఘిక వాతావరణం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. వేసవి సెలవులు జూన్ 11తో ముగియనున్న నేపథ్యంలో ఆలోపే అన్ని మరమ్మత్తులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపరిస్తే, ప్రైవేటు పాఠశాలలతో పోటీచేసేలా వాటిని తయారు చేయవచ్చన్నారు. డీఎంఎఫ్ నిధులను వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి "అమ్మ ఆదర్శ కమిటీలు" కీలకంగా ఉండేలా చూడాలని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ కార్యదర్శి అక్కెనపల్లి నాగేంద్రబాబు, రామ్, రమేష్, సాయి, ఆదిత్య, మోహన్, విశాల్, శ్రీకాంత్, శేఖర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం చేసిన జి.విజయ్ కుమార్రై

**తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి, కేటీఆర్ సేన రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్**



రంగారెడ్డి, జూన్ 06 తొలి క్రాంతి:రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ జిల్లేల మహేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న జి.విజయ్ కుమార్ వెంటనే స్పందించారు. మహేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఆయన, ఆర్థిక సహాయం అందజేశారు. బాధితుడు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆయన తెలిపారు.



# ప్రభుత్వ పాఠశాలలే విద్యకు నిజమైన ఆధారం

**పేదరికాన్ని జయించాలంటే విద్యే మార్గం**

**- కాంప్లెక్స్ హెచ్ఎం టీ. వీరేశ్వరరావు**

**గుమ్మడవల్లి హైస్కూల్ గ్రామసభకు విశేష స్పందన**

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే సమాజ అభివృద్ధికి మౌలికం**

అశ్వరావుపేట, జూన్ 06 తొలి క్రాంతి: గుమ్మడవల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామసభఅశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి గ్రామంలో స్థానిక హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ అభినందనీయంగా సాగింది. పేద ప్రజలకు చదువు ముఖ్యమైన అస్త్రంగా మారాలంటే, ప్రభుత్వ పాఠశాలలే భరోసాగా నిలుస్తాయని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి. వీరేశ్వరరావు స్పష్టం చేశారు.విద్యే పేదలకు ఆయుధం"పేద పేదరికాన్ని జయించాలంటే విద్యే మార్గం. ఆ విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలే అసలైన మార్గదర్శకాలు. ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి ప్రతి గ్రామస్తుడూ భాగస్వామిగా మారాలి," అని ఆయన తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి చైతన్య కార్యక్రమంగా గ్రామసభను నిర్వహించడం ఎంతో అవసరమని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.గ్రామస్తుల విశ్వాసం – ఉపాధ్యాయుల కృషిఈ గ్రామసభలో ఉపాధ్యాయులు గణిత బోధన చేస్తోన్న బి. శ్రీనివాసరావు చక్కటి నిర్వహణతో ముందుండగా, తెలుగు ఉపాధ్యాయులు సభను చక్కగా సమన్వయం చేశారు. సభలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని, తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తామంటూ ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. గుమ్మడవల్లి హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలను గ్రామస్తులు అభినందించారు.ప్రభుత్వ పాఠశాలల వైపు ప్రజల మొగ్గు"ప్రభుత్వ పాఠశాల ముద్దు – ప్రైవేట్ పాఠశాల వద్దు" అనే నినాదాలతో సభ మార్మోగింది. ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఆరోగ్యపరమైన వసతులు, మెరుగైన భౌతిక మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.పాల్గొన్న వారుఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్పీ మాలోతు రామారావు, ఇతర స్థానిక విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.ముగింపుఈ గ్రామసభ ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడంలో కీలక ఘట్టంగా నిలిచింది. సమగ్ర అభివృద్ధికి బీజంగా విద్యను మిగిలిన ప్రతి ఒక్కరూ ఆకాంక్షించి, ప్రభుత్వ విద్యను పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.





# విద్యా వెలుగు వైపు ప్రజల అడుగులు




- **డోర్ టు డోర్ క్యాంపెయిన్‌తో ప్రజల్లో చైతన్యం**
- **ప్రభుత్వ పాఠశాలలకే నూతన జీవం**
- **తల్లిదండ్రుల నుంచి ఆశాజనక స్పందన**

అశ్వరావుపేట, జూన్ 06 తొలి క్రాంతి: అశ్వారావుపేట మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఒక విస్తృత స్థాయి అవగాహనా కార్యక్రమం జరగడం జరిగింది. విద్యను బలోపేతం చేయడమే ముఖ్య లక్ష్యంగా మాండలిక విద్యాధికారి పి. ప్రసాద్ రావు పర్యవేక్షణలో గ్రామసభలు, డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా శుక్రవారం నాడు ప్రతి గ్రామంలో గ్రామసభలు విజయవంతంగా నిర్వహించాం. ప్రజల్లో విద్యాపట్ల అవగాహన పెంచేలా చర్యలు తీసుకున్నాం," అని తెలిపారు.

అశ్వారావుపేట మండలంలోని జడ్పీహెచ్ఎస్ మామిళ్ల వారి గూడెం హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన గ్రామసభ పెద్ద సంఖ్యలో గ్రామస్తులను ఆకర్షించింది. ఎంఈఓ పి. ప్రసాద్ రావు స్వయంగా హాజరై, గ్రామస్థుల మధ్య చైతన్యం రేకెత్తించారు. అలాగే ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, అంగన్వాడి సిబ్బంది గ్రామస్థుల కృషితో ఈ కార్యక్రమాలు విజయం సాధించాయి.

ఎంఈఓ మాట్లాడుతూ, "ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి అని కోరగానే తల్లిదండ్రులు కూడా ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్యపై విశ్వాసం చూపుతూ హామీ ఇచ్చారు" అన్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో మారుతున్న దృక్కోణానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలు:

ఉచిత పాఠ్యపుస్తకాలు
నాణ్యమైన మధ్యాహ్న భోజనం
ఉచిత డ్రెస్‌లు
ఉత్తమ ఉపాధ్యాయ బృందం
శుభ్రమైన భవనాల వాతావరణం
ప్రైవేట్ స్కూళ్లతో పోల్చితే ఖర్చులేని చదువు



**ఉపాధ్యాయుల అభిప్రాయం:**

చక్కటి విద్యా వ్యవస్థతోనే చక్కటి భవిష్యత్తు సాధ్యమవుతుందని, అది ఉత్తమ ఉపాధ్యాయుల కలయికతోనే సాకారం అవుతుందని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతపై ఇక ఎలాంటి సందేహాలు అవసరం లేదని, భవిష్యత్తులో ప్రతి గ్రామస్తుడు ప్రభుత్వ పాఠశాలకే మొగ్గు చూపే రోజులు దూరం కావని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

**ప్రజల సహకారమే విజయ రహస్యం:**

ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు చురుకుగా పాల్గొనడం, విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వానికి తోడుగా నిలవడం ముఖ్యాంశంగా మారింది. ప్రతి గ్రామస్తుడు తగిన భాగస్వామిగా మారిన సందర్భంలో... విద్యా విప్లవం అసాధ్యమేమీ కాదని ఈ కార్యక్రమం నిరూపించింది.ఈ విధంగా అశ్వారావుపేట మండలంలో విద్యను ప్రజల పట్ల ఒక బాధ్యతగా తీసుకుంటూ ప్రభుత్వ యంత్రాంగం ముందడుగు వేస్తోంది.






## పాఠశాల అభివృద్ధికి గ్రామస్థుల ముందడుగు

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి – ప్రధానోపాధ్యాయురాలు షఫీయా

అశ్వరావుపేట రూరల్, జూన్ 06 తొలి క్రాంతి:అశ్వారావుపేట మండలంలోని వడ్డెరంగాపురం ప్రాథమిక పాఠశాలలో గ్రామసభ ఘనంగా నిర్వహించబడింది. ఈ సభలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై, పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవుతామని వెల్లడించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ షఫీయా మాట్లాడుతూ –"ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉంది. అందుకే ప్రతి విద్యార్థుల తల్లిదండ్రులు, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వారి భవిష్యత్తుకు తోడ్పడాలి" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## లలిత కంగన్ హాల్ లో స్కూల్, హ్యాండ్, లగేజ్ బ్యాగ్స్

**నాణ్యతతో కస్టమర్ల మనసు గెలుచుకుంటున్న షాప్**

**నాణ్యతే లక్ష్యం అంటున్న యజమాని**

**అన్ని వయసుల వారికీ అనువైన బ్రాండెడ్ బ్యాగ్స్**

**సూపర్ బజార్ సెంటర్, కొత్తగూడెంలో లభ్యం**

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 06 తొలి క్రాంతి:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలోని సూపర్ బజార్ సెంటర్లో ఉన్న లలిత కంగన్ హాల్లో స్కూల్, కాలేజ్ విద్యార్థులకు ఉపయోగపడే అన్ని రకాల బ్యాగ్స్ అందుబాటులో ఉన్నాయి. చిన్నారుల నుండి బీటెక్ విద్యార్థుల వరకు అందరికీ అనుకూలంగా, నాణ్యతతో కూడిన స్కూల్ బ్యాగ్స్ లభ్యమవుతాయి.అలాగే మహిళల కోసం హ్యాండ్ బ్యాగ్స్, ప్రయాణికుల కోసం లగేజ్ బ్యాగ్స్, పిల్లలు–పెద్దల కోసం బెల్టులు, పర్సులు బ్రాండెడ్ మోడల్స్‌లో లభిస్తున్నాయి. రాయల్టీ, క్రియేషన్, స్కై, హాట్‌షాట్, నివ్య వంటి ప్రఖ్యాత బ్రాండ్స్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి."డబ్బులు ముఖ్యం కాదు... నాణ్యతతో కస్టమర్ సంతృప్తి మాకు ప్రధానమని" చెబుతున్నారు షాప్ యజమాని. స్కూల్, కాలేజీలు ప్రారంభం అవుతున్న ఈ వేళ, తక్కువ ధరలకే అధిక నాణ్యత కలిగిన బ్యాగ్స్‌ను కొనుగోలు చేయడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.



## ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులకు విత్తనాలు, ఎరువుల సరఫరా చేయాలి

**తహసీల్దార్ కార్యాలయం ముందు ఏఐకేఎస్ ధర్నాకేంద్ర**

**-రాష్ట్ర ప్రభుత్వాలపై రైతు సంఘం విమర్శ**




జూలూరుపాడు, జూన్ 06 తొలి క్రాంతి:ఖరీఫ్ పంట సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో జూలూరుపాడులో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి టి. నరేష్ అధ్యక్షతన, జిల్లా సహాయ కార్యదర్శి భానోతు ధర్మ మాట్లాడుతూ రైతుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. "రైతే రాజు అంటారు కానీ ఆచరణలో రైతులకు నష్టం కలిగే విధానాలే కొనసాగుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ముందస్తుగా వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలని, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా ఇప్పటికీ రైతు రుణ మాఫీ అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా చెప్పిన రెండు లక్షల రూపాయల రుణ మాఫీ ఇంకా అమలుకావడం లేదని ఆరోపించారు.ఈ ధర్నాలో తాటి నరసింహారావు, భూక్య బాలు, నాగేశ్వరరావు, బాలకోటి, భావసింగ్, భోజ్య దశరథ్, పారుపల్లి కృష్ణారావు, ఎట్టి కృష్ణార్జునరావు, బి. నరేష్, బాణోతు వీరు, జి. బాలాజీ, వి. కోటియా, ఎన్. మేఘ్య, ఆర్. తిరుమల్ రావు, బి. శీను తదితరులు పాల్గొన్నారు.



## ఆపరేషన్ కగార్ హత్యాకాండలకు స్వస్తి పలకాలి

**మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలి**

**రౌండ్ టేబుల్ సమావేశంలో పలు రాజకీయ పార్టీలు డిమాండ్**

కొత్తగూడెం, జూన్ 6 తొలి క్రాంతి:ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దాడుల కారణంగా ఇప్పటికే వందలాది మంది ఆదివాసీలు, మావోయిస్టులు బలైపోతున్నారని, ఈ హత్యాకాండను తక్షణమే ఆపాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఐఎఫ్టియు కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ గౌని నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.540 మందికి పైగా హత్యలు – 300 మందికి పైగా ఆదివాసులేఈ సందర్భంగా మాట్లాడిన సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథ జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ, టీజేఎస్ రాష్ట్ర నాయకులు రామనాథం తదితరులు మాట్లాడుతూ – గత 17 నెలల్లో ఆపరేషన్ కగార్ పేరుతో 540 మందికిపైగా మావోయిస్టులను హత్య చేసినట్టు పేర్కొన్నారు. వీరిలో 300 మందికి పైగా ఆదివాసులే కావడం విచారకరమన్నారు.మావోయిస్టుల లేఖలను కేంద్రం విస్మరిస్తోందిమావోయిస్టు కేంద్ర కమిటీ మూడు లేఖల ద్వారా శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించినా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాని మోదీ అణచివేత విధానానికే ప్రాధాన్యత ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నంబల కేశవరావు నుంచి మొదలుకొని సుధాకర్ వరకు మావోయిస్టు నాయకులను లక్ష్యంగా చేసుకుని చంపుతున్నారని విమర్శించారు.చలో హైదరాబాద్ – జూన్ 14న భారీ ప్రజాసంగ్రామంఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సహా అనేక ప్రాంతాల్లో మావోయిస్టులపై, ఆదివాసులపై కేంద్ర ప్రభుత్వం నడుపుతున్న దాడులను నిలిపి, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు ప్రారంభించాలని వారు కోరారు. శాంతి చర్చల కమిటీ పిలుపు మేరకు జూన్ 14న జరిగే "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నందిపాటి రమేష్, వై.గోపాలరావు, రాజశేఖర్, ప్రణయ్ కుమార్, బంక వెంకటేశ్వర్లు, బి.శివ తదితరులు పాల్గొన్నారు.



## బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలే మార్గం

**కరకగూడెం బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపు**


**ఈ విద్యా సంవత్సరం నుండి కరకగూడెంలో జవహర్ నవోదయ విద్యాలయం ప్రారంభం**

కరకగూడెం, జూన్ 06 తొలి క్రాంతి:పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలంటే ప్రభుత్వ పాఠశాలలే సరైన ప్రత్యామ్నాయమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. శుక్రవారం కరకగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ –"ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులతో విద్యను ఉచితంగా అందిస్తున్నాం. తల్లిదండ్రులు అనవసరంగా ఖర్చుపెట్టి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లాల్సిన అవసరం లేదు. కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోంది" అని తెలిపారు.ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారమ్‌లు, మధ్యాహ్న భోజనం, ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఉచిత వైద్య పరీక్షలు, అర్హులైన ఉపాధ్యాయుల ద్వారా బోధన వంటి అన్ని అంశాలపై ప్రభుత్వ పాఠశాలలు ముందున్నాయన్నారు.జవహర్ నవోదయ విద్యాలయం – జిల్లాకు గర్వకారణంఈ విద్యా సంవత్సరం నుండి కరకగూడెంలో జవహర్ నవోదయ విద్యాలయం ప్రారంభం కానుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటవుతున్న ఈ కేంద్రం, జిల్లాకు గొప్ప అవకాశంగా మారుతుందని పేర్కొన్నారు. జూన్ 12 నాటికల్లా పనులను పూర్తిచేసి విద్యాలయం ప్రారంభించాలంటూ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో పాల్గొన్నవారుఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, తహసీల్దార్, అకడమిక్ కోఆర్డినేటర్ నాగరాజు శేఖర్, మండల విద్యాధికారి మంజుల, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచి, మన పిల్లల భవిష్యత్తును వెలిగించుదాం.

## హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నాగేశ్‌కు కలెక్టర్ ఆత్మీయ సన్మానం



భద్రాచలం, జూన్ 06 తొలి క్రాంతి:తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నాగేశ్ భద్రాచలం పర్యటనలో భాగంగా సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్ కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను బహుకరించి ఆత్మీయంగా అభినందించారు.



– రైతులకు కష్టాలే మిగిలిన వాస్తవం

- అమాయకుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న అక్రమ దందా

# నకిలీ విత్తనాల ముళ్ల బాట

**భద్రాద్రి బ్యూరో జూన్ 06( తొలి క్రాంతి):తెలంగాణ రాష్ట్రంలో నకిలీ విత్తనాల వ్యాపారం భయంకర స్థాయికి చేరుకుని రైతుల జీవితాల్లో తీవ్ర సంక్షోభాన్ని తీసుకొస్తోంది. వ్యవసాయం మీద ఆధారపడిన సామాన్య రైతులు తమ కుటుంబ పోషణ కోసం ఆశతో పెట్టుబడి పెట్టి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. అయితే అర్హతలేని నకిలీ వ్యాపారులు తమ స్వార్థం కోసం అమాయక రైతులను మోసం చేస్తూ నాసిరకం విత్తనాలను విక్రయిస్తూ రైతుల కష్టాలను రెట్టింపు చేస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు మండలాలు గిరిజన గ్రామాలు ఈ దుష్పరిణామానికి కేంద్రంగా మారాయి**

.పూర్తిగా అనుభవం లేని చదువు లేక సమాచారాభావంలో ఉన్న రైతులు విత్తనాల విషయాల్లో సరైన అవగాహన లేకుండా నకిలీ విత్తనాలను నమ్ముతూ కొనుగోలు చేస్తున్నారు. "ఇది బాగా కాస్తుంది" అన్న మాటను నమ్మి వ్యవసాయ అధికారుల అధికారిక ధృవీకరణ లేకుండానే అనుమానాస్పద కంపెనీల విత్తనాలను ఉపయోగిస్తున్నారు. పంట నాశనమయ్యే దశకి చేరుకున్న తర్వాతే వారు మోసపోయిన విషయాన్ని గ్రహిస్తున్నారు. దీని వెనుక ఉన్న వ్యాపారదారులు తమ వద్ద లైసెన్సులు ఉన్నట్లు చూపిస్తూ వ్యవసాయ శాఖను మభ్యపెడుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు లేకుండా, రంగు బొట్టు పెట్టిన ప్యాకెట్లలో విత్తనాలను విక్రయిస్తూ రైతుల నమ్మకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.ఈ నకిలీ విత్తనాల దందా వల్ల రైతులు పెద్ద ఎత్తున నష్టాలను మూటగట్టుకుంటున్నారు. అప్పులు తీసుకుని పెట్టుబడి పెట్టిన వారు పంట దిగుబడి రాకపోవడంతో తిరిగి ఆ అప్పులు తీర్చలేని స్థితికి చేరుకుంటున్నారు. చాలా రైతులు భూములను అమ్ముకునే పరిస్థితికి దిగజారుతున్నారు. ముఖ్యంగా గిరిజన తండాల్లో నివసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రైతులు విద్య, ఆరోగ్యం వంటి మౌలిక అవసరాలు తీర్చలేని స్థితిలోకి వెళ్లిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరాశ, నిస్పృహ వ్యాపిస్తూ, వ్యవసాయంపై విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొంది.ఇక మరోవైపు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు మండలాల గిరిజన గ్రామాల్లోకి అక్రమంగా నకిలీ విత్తనాలు నకిలీ ఎరువులు చొరబడుతున్నాయి. సరైన అనుమతులు లేకుండా అవి మార్కెట్‌లోకి రావడం, వాటిని ఎవరు పంపుతున్నారు, ఎవరి అండతో నడుస్తున్నాయన్న ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు లేవు. ఇది వ్యవసాయ శాఖ నిఘా పూర్తిగా విఫలమైందన్న స్పష్టమైన సంకేతం. ఈ అక్రమ రవాణా రైతుల జీవితాలను నాశనం చేస్తోంది.ఈ పరిస్థితిని అదుపులోకి తేయాలంటే సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, రెవిన్యూ శాఖ, కమర్షియల్ ట్యాక్స్ శాఖ కలిసి నకిలీ విత్తనాల దందాను అరికట్టాలి. ప్రజలు, రైతులు తమ డిమాండ్లను గట్టిగా వినిపిస్తున్నారు. నకిలీ విత్తనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అక్రమ వడ్డీ వ్యాపారాలను పూర్తిగా నిలిపివేయాలి. విత్తన కంపెనీల లైసెన్సులపై పునఃసమీక్ష జరగాలి. గ్రామస్థాయిలో విత్తన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను చైతన్యపరచాలి. నకిలీ విత్తనాల వ్యాపారుల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి.రైతుల అరుపు ప్రస్తుతం గగనాన్ని తాకుతోంది "మేము శ్రమిస్తాం... మీరు రక్షించండి!" అనే విన్నపం పాలకుల చెవిలో పడాలి. "రైతులే దేశానికి వెన్నెముక" అనే మాటలు నిండు నూరేళ్లకు పరిపాలించాలంటే ఈ విధంగా జరిగే అన్యాయాలపై ప్రభుత్వం కఠినంగా స్పందించాలి. లేనిచో, వ్యవసాయ రంగమే శూన్యస్థితికి చేరిపోతుందన్న భయం అసత్యం కాదు.



## త్యాగానికి ప్రతీక బక్రీద్

**– ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన నామ నాగేశ్వరరావు**

ఖమ్మం, జూన్ 6 తొలి క్రాంతి:బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు. ఈ సందర్భంగా శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడారు."త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ మానవత్వం, సమానత్వం, దాతృత్వం వంటి విలువలను గుర్తు చేస్తుంది" అని నామ పేర్కొన్నారు. ఈ పర్వదినం ద్వారా ప్రజల్లో దయ, కరుణ, సేవా గుణాలు పెంపొందాలని ఆకాంక్షించారు.సేవా దృక్పథంతో ముందుకు సాగి, సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తన వంతు పాత్రను నిర్వర్తించాలన్నారు. శాంతి, సోదరభావం నెలకొల్పేందుకు బక్రీద్ సందేశం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమవుతుందన్నారు.ముస్లిం సోదరులు ఈ పండుగను భక్తి, శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన కోరారు.





# సర్కారు బడిలో చదువు

**- జీవిత పాఠాలకు గెలుపు"సర్కారు బడికి పోదాం**

**- మేలైన విద్యను పొందుదాం" నినాదంతో బడిబాట ప్రారంభం**




కొత్తగూడెం, జూన్ 06 తొలి క్రాంతి:కొత్తగూడెం మండల పరిధిలోని 11వ వార్డు చిట్టి రామవరం తండాలో బడిబాట కార్యక్రమాన్ని సీపీఐ జిల్లా సమితి సభ్యులు, మాజీ వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సర్కారు బడిలో చదువు అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితమవకుండా, జీవిత పాఠాలకు మార్గదర్శకమవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి విద్య, నాణ్యమైన అభ్యాసం అందించబడుతోంది. ప్రతి తల్లిదండ్రుడు తమ పిల్లలను అంగన్‌వాడీ నుంచే ప్రభుత్వ పాఠశాలల వైపు ప్రోత్సహించాలి" అని పిలుపునిచ్చారు.అలాగే విద్య ద్వారా పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి తమ భవిష్యత్తును మెరుగుపరచుకోవచ్చని, ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉషా దేవి, కిషన్, ప్రిస్కిల్లా, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, తులసి బాయి, ఈశ్వరి, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులలోనే మెరుగైన విద్య

**పరుచూరి హరిత**

అశ్వరావుపేట, జూన్ 06 తొలి క్రాంతి:ప్రభుత్వ బడులలోనే నైపుణ్యాలు సాధించే మెరుగైన విద్య అందుతుందని కాంప్లెక్సు రపధానోపాధ్యాయురాలు పరుచూరి హరిత అన్నారు. అశ్వారావుపేట కాంప్లెక్సు పరిధిలోని వివిధ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్చం. బేబిపద్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభకుముఖ్య అతిథిగా విచ్చేసిన కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయురాలు హరిత మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా సకల సౌకర్యాలతో బలోపేతం చేసిందని అత్యంత ఖరీదైన డిజిటల్ విద్యాబోధన జరుగుతుందని ,సుశిక్షితులైన ఉపాధ్యాయులచే ఆంగ్ల, తెలుగు మాధ్యమాలలో బోధన,మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్యపుస్తకాలు,రాగిజావ, కంప్యూటర్ విద్య వంటి అవకాశాలు కల్పిస్తుందని ప్రతి తరగతిగదిలో విద్యార్థులకు అనువైన సౌకర్యాలు కల్పించిందని డబ్బులు వెచ్చించి ప్రయివేటు పాఠశాలలకు పంపవద్దని డబ్బులు ఉన్నత చదువులకు వినియోగించుకోవచ్చునని తల్లిదండ్రులకు గ్రామసభసభ్యులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాధ్యాయులు యామిని,జ్యోతి, అమ్మ ఆదర్శ పాఠశాల వి.ఓ కనకమహాలక్ష్మి , అంగన్వాడీ టీచర్లు,మహిళాసమాఖ్య సభ్యులు,జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల సి.ఆర్.పి ప్రభాకరాచార్యులు, పాల్గొన్నారు.



## నూతన వధూవరులకు మాజీ ఎంపీ నామ ఆశీర్వాదం

ఖమ్మం, జూన్ 06 తొలి క్రాంతి:హైదరాబాద్‌లో మియాపూర్ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఓ వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.హైదరాబాద్ వాస్తవ్యులు యెనిగళ్ళ నీలకంఠేశ్వరరావు–లక్ష్మీ ప్రసూన దంపతుల కుమారుడు మోహన్ చైతన్యకు, రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం వాస్తవ్యులు కుతుంబాక వెంకటరమణ–కవితల కుమార్తె వర్షతో ఇటీవల వివాహం జరిగింది. అనంతరం ఈ రిసెప్షన్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



## ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

**కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం**

వర్ధన్నపేట, జూన్ 06 తొలి క్రాంతి: పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, పీసీసీ సోషల్ మీడియా మాజీ రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ తెలిపారు.శుక్రవారం బాలాజీ నగర్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి /షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ — గత టీఆర్ఎస్ పాలనలో చెక్కుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తక్కువ సమయంలోనే చెక్కులు అందుతుండటం సంక్షేమ పరిపాలనకు నిదర్శనమన్నారు.పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు పస్తం శంకర్, ఏనుమాముల గ్రామ అధ్యక్షుడు సౌరం చిన్ని, బాలాజీ నగర్ గ్రామ అధ్యక్షుడు కడెం కుమార్, ఎస్సార్ నగర్ అధ్యక్షుడు మచ్చర్ల స్టాలిన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పత్రి రాజేష్, ఏకాబ్రచారి, త్రికోవెల శీను, కాశెట్టి కమలాకర్, తాళ్ల పెల్లి రాకేష్, పల్లకొండ చందు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ రంగంలోకి అడుగుపెట్టిన ప్రజాప్రతినిధి

**ప్రజలకు న్యాయం అందించాలన్న సంకల్పంతో లాయర్ ప్రవేశ పరీక్ష రాసిన ఎమ్మెల్యే జారె**



అశ్వరావుపేట, జూన్ 06 తొలి క్రాంతి:అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రజలకు న్యాయసహాయం అందించాలన్న సంకల్పంతో న్యాయవిధానం వైపు అడుగులు వేస్తున్నారు. న్యాయ విద్యపై తనకున్న అభిరుచి మేరకు ఈ రోజు హైదరాబాద్‌లో నిర్వహించిన లాయర్ ప్రవేశ పరీక్ష కు స్వయంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ,"న్యాయ విద్యపై నాకు చిన్ననాటి నుంచీ ఆసక్తి ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు న్యాయపరంగా పరిష్కారం కావాల్సిన అవసరం కనిపిస్తోంది. అందుకే న్యాయవిధానం గురించి లోతుగా తెలుసుకుని, మరింత సమర్థవంతంగా సేవ చేయాలన్న లక్ష్యంతో ఈ పరీక్ష రాశాను," అని తెలిపారు.అధికార బాధ్యతల నెరవేర్చడంలోనే కాక, సామాజిక న్యాయం కోసం కూడా కృషి చేయాలన్న ఆత్మీయ తపనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. "న్యాయవిధానం ద్వారా ప్రజలకు స్పష్టమైన దిశనిచ్చే అవకాశం ఉంది. సాధారణ పౌరులకు న్యాయ పరంగా అండగా నిలవడమే నా బాధ్యతగా భావిస్తున్నాను," అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజా ప్రతినిధిగా ఉన్నత విలువలతో ముందుకెళ్తూ, న్యాయరంగం వైపు ప్రయాణాన్ని ప్రారంభించడం యువతకు ప్రేరణగా నిలుస్తుందనే విషయం ఒప్పుకోకుండా ఉండలేం. సేవా దృక్పథం, సామాజిక స్పృహ, న్యాయంపై ఉన్న మక్కువను మనసారా ప్రతిబింబిస్తూ... ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఒక ఆదర్శంగా నిలుస్తున్నారు.

# దేశానికే ఆదర్శంగా సింగరేణి ప్రమాద బీమా పథకం

భద్రాద్రి కొత్తగూడెం సింగరేణి, జూన్ 06 తొలి క్రాంతి:సింగరేణి సంస్థలో అమలు చేస్తున్న కోటి రూపాయల ప్రమాద బీమా పథకం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోందని సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఇటీవల మణుగూరులో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఈపీ ఆపరేటర్ మూల్ చంద్ విశ్వకర్మ కుటుంబానికి కొత్తగూడెం హెడ్డాఫీసులో కోటి రూపాయల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన స్పందించారు.విశ్వకర్మ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ శాలరీ ఖాతాదారిగా ఉండటంతో ప్రమాద బీమా వర్తించిందని వివరించారు. బ్యాంకుల సహకారంతో అత్యధికంగా రూ.1.25 కోట్లు వరకూ బీమా పొందేలా చర్యలు తీసుకున్న సంస్థగా సింగరేణి తొలి సారిగా మార్గదర్శకమైందన్నారు.ఈ బీమా పథకాన్ని అసోం, ఉత్తర ప్రదేశ్, కోల్ ఇండియా వంటి ఇతర రాష్ట్రాలు, సంస్థలు కూడా అమలు చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఈ ప్రయోజనాలు సాకారమవుతున్నాయన్నారు. ఉద్యోగులు సురక్షితంగా, ఆర్థిక భరోసాతో ఉండాలన్నదే సంస్థ లక్ష్యమని తెలిపారు. ప్రమాదాల సమయంలో ఒక్కసారిగా కుటుంబాలపై పడే భారం తగ్గించేందుకు శాలరీ అకౌంటు ఉన్న ప్రతి ఉద్యోగికి ఈ బీమా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా రూ.40 లక్షల వరకూ ప్రమాద బీమా అమలులో ఉంది.కోటిచెక్కు అందజేసే కార్యక్రమంలో డైరెక్టర్‌లు ఎల్.వి.సూర్యనారాయణ, కే.వెంకటేశ్వర్లు, ఎస్బీఐ డీజీఎం సత్యనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.డి.ఎం.సుభానీ, జీఎంలు కవితా నాయుడు, నికోలస్, కిరణ్ కుమార్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. గుర్తింపు సంఘాల నాయకులు రమణ మూర్తి, పీతాంబరరావు, సునీల్ వర్మ హాజరయ్యారు.

